# వెలుగునీడలు

**బా**గా చలివేస్తున్నా, చీకటితోనే లేచి స్టౌ వెలిగిస్తాడు జయరావు. ఆవేళనించి అతనికి ఓ వారం వరకు నైట్‌షిఫ్టు. పగలంతా శుభ్రంగా విశ్రాంతి తీసుకోవొచ్చు ననుకుంటాడు.

కాఫీ పూర్తి కాకుండానే స్టౌ కిరసనాయిల్‌కు నోరుచాపుతుంది. ముందు దాని తృప్తి తీరుస్తూ 'యుద్ధమైపోయిందిలే!' అనుకొంటాడు, తను కిరసనాయిల్ కోసరం పడినబాధ తల్చుకొని. పంచదార టిక్ కూడా బోసి నోరేసిందేమోనని భయపడతాడు. కాని ఫ్యాక్టరీ స్టోర్సు ధర్మమా అని అంతపని తటస్థించదు.

తర్వాత సిగరెట్ కాలుస్తు ఏవో గాలి మేడలు పొగతో నిర్మిస్తుంటాడు. భార్యను తీసుకువొచ్చి సుఖంగా కాపరం పెట్టడానికి 'యుద్ధమై పోయిందికదా!' అనుకుంటాడు. ధరలు తగ్గే సూచనల్ని చూస్తుంటాడు.

మళ్ళీ లేచి వూళ్ళోకి బయలుదేరుతాడు. ఏ ఉలెన్‌కోటో బిగుతుగా పట్టుతుంది. 'యుద్ధమైందిగా! కొత్తది కట్టించుకోగలను' అనుకుంటాను.

ఇల్లు దాటి స్లోపు యెక్కగానే ఊటీనించి వొచ్చిన సరోజిని కలుస్తుంది.

"యెక్కడికి ప్రయాణం?"

వెల్లింగ్‌టన్ వైపు వేలు చూపుతాడు. కాని తనకు వొకసారి ఊటిపోవాలనే కోరికపోదు. ఎంతకీ వీలుపడ్డంలేదు. చల్లని మేఘాలు తనని దాటుకు వెడుతోంటే ఎంతో సంతోషిస్తాడు. అక్కడి పార్కు గ్లాస్ హౌస్‌లోని వివిధ రకాల పువ్వుల్ని క్రోటన్సునీ తను యెప్పటికీ మర్చిపోలేడు.

అసలు నీలగిరీస్ జీవితమే అట్లా వుంటుంది అతనికి. పూర్వం ఇంగ్లీషు నావెల్సులో, సినిమాల్లో చూసిన, వాళ్ళ దేశ వాతావరణం కొంచెంగా కనపడుతుంది అక్కడ.

ఇద్దరు కల్సి మాట్లాడుకుంటూ, నడుచుకు పోతుంటారు. ఎంతో సజీవంగా వుంటుంది. ఆ జీవితం. కాని తన మురికి పట్నాల్లోని నిర్జీవపు బతుకు ఒక్కొక్కసారి మనసును కలిచి వేస్తూంటుంది.

సరోజిని కొన్ని యూకలిప్టస్ ఆకుల్ని తుంచి వాసన చూస్తుంది. దూరంగా బడగా కుఱ్ఱవాడు బేరికాయ తింటుంటాడు.

"ఈవేళ ఫాక్టరీకి పోనక్కర్లే?"

సరోజిని అడుగుతుంది.

"నైట్ డ్యూటీ" అంటాడు ముక్తసరిగా.

ఎదరవచ్చే గౌడరీని తప్పించుకుందామను కుంటాడు. కాని ఆ దేవాంతకుడు సులువుగా పోనీడు. అనుకున్నట్టుగానే తనను ఆపి అద్దె అడుగుతాడు. "రెండు రోజుల్లో ఇచ్చేస్తా" నని సరిపుచ్చుతాడు.

"రెండు గదులకేవ్వాండు రూపాయలు. దోపిడి! అంతా దోపిడి!! ఉండండి, యద్ధమైపోయింది. మీ అద్దెలు తగ్గుతాయి" అనుకుంటాడు మళ్లీ.

వెల్లింగ్టన్ పార్కు సమీపిస్తారు. కాని అక్కడ ఆగరు. మార్కెట్టు మీంచి కూనూరు పోతారు.

దూరంనించి చల్లగాలి మధ్య మధ్య ఇంగ్లీషువాళ్ల నవ్వుని మోసుకవచ్చి గిలిగింతలు పెడుతుంది. తలకి చుట్టిన తన మఫ్లరు తీసేసి సరోజిని భుజంమీద పడేసి, ఆమె చీరతో పోల్చి చూస్తుంటాడు. సిగరెట్ కాల్చుకుంటూ అలవాటు చొప్పున – సరోజినికి ఒకటి ప్రెజంట్ చెయ్యబోతాడు.

కూనూరు చేరుతారు. సరోజిని అడుగుతుంది.

"సినిమాకి పోదామా?"

"అరవ గోలేగా"

"పోనీబ్లడ్ అండ్ సాన్డ్కి"

మాట్లాడడు. తన కిష్టంలేని పని అని చెప్పేందుకు అతను అవలంబించే విధానమది.

పార్కులో పచ్చికలో పడుకుంటాను. ఏవేవో కబుర్లు చెపుతాడు. అక్కడ ఇంకావున్న తెలుగువాళ్ల క్షేమాన్ని అడుగుతాడు. తాము తెరచిన లైబ్రరీ సంగతీ, తన వుపన్యాసము అన్నీ దొర్లుతాయి.

యూకలిప్టస్ గుబురు మాటునుంచివచ్చే (ఇండైరెక్టు) పరోక్ష సూర్యకిరణం సరోజిని జుత్తుతో ఆడుకోవడం చూసి యెంతో సంతోషిస్తాడు.

మెయిల్ వచ్చే టైమవుతుంది. అద్భుత దృశ్యాలన్నిటికీ 'గుడ్ ఈవినింగ్' చెప్పి, ఇద్దరూ కలిసి ఇంటికిపోతాడు.

హెూటలువాడు చల్లని భోజనం పెడతాడు 'పాతిక రూపాయలు పుచ్చుకుంటూకూడా ఈచలిదేశంలో ఇదేమిటి? యుద్ధమైంది. నీ రేటు కూడా తగ్గుతుందిలే' అనుకుంటాడు.

రాత్రి పనికి పోతాడు. ఫ్యాక్టరీలో యెవరో కలుస్తారు, ఫోర్మన్ దూరంగా వున్నప్పుడు.

"రేపు ఫస్టునించి పాతిక మందిని డిస్‌చార్జి చేద్దామనుకుంటున్నారుట" అంటారు.

"ఏమి?"

"యుద్ధమైందిగా!"

యుద్ధమైపోయింది! తన ఉద్యోగంకూడా పోయేలా ఉంది; అందులో చివరి బాచ్‌లోని వాడు.

"యుద్ధమయిపోయింది. మళ్ళీ నాకు నిరుద్యోగం తప్పదు, ఐతేనేం స్వేచ్ఛగా బతకొచ్చు" అనుకుని, సమాధానపర్చుకుంటాను మనస్సుని, ఇంటికిపోతూ